సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



'వందేభారత్' పరుగులు

కాజీపేట జంక్షన్ మీదుగా నేటి (గురువారం) నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸



సేవ..మరింత చేరువ - 8లో▸

వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు అవసరమైన సేవలు పొందేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

గరిష్టం/కనిష్టం
$33^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ



కేయూ క్యాంపస్: కేయూలోని భూముల ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. క్యాంపస్‌లోని పాత ఫార్మసీ హాస్టళ్ల ఏరియా కుమార్‌పల్లి ప్రాంతంలోని 214 సర్వే నంబర్ భూమిలో ఆక్రమణలున్నాయా? అనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఈసర్వే అనంతరం ఈనెల 19న 214 సర్వే నంబర్ భూమిలో యూనివర్సిటీ భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించి మార్కింగ్ ఇచ్చే అవకాశం ఉందని సంబంధిత కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారుల ద్వారా తెలిసింది. ఇప్పటికే 229 సర్వే నంబర్ భూమిలో యూనివర్సిటీ భూమికి సంబంధించిన ఆక్రమణలను గుర్తించిన విషయం తెలిసిందే. ఆభూమిలో హద్దులు నిర్ణయించి మార్కింగ్ కూడా చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే రిపోర్టు ఇవ్వగానే ఆక్రమణల్ని యూనివర్సిటీ అధికారులు ఆక్రమణల్ని తొలగించనున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వరంగల్ హంటర్‌రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో లివిన్‌స్టన్, తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, రఫూఫ్, సురేశ్‌కుమార్, అశోక్, మాధవి, ప్రవంతి, సతీశ్, గణేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీమ్ విజేతల ఎంపిక

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్ విజేతలను బుధవారం డ్రా తీసి ప్రకటించారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా బస్ స్టేషన్‌లో ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఆర్మూరుకు చెందిన సుప్రియ 99488 26404, హనుమకొండకు చెందిన స్వరూప 90101 70848, వరంగల్‌కు చెందిన రత్న 99899 99955 విజేతలుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ చిమ్మని సంతోశ్, బస్ స్టేషన్ కంట్రోలర్ పబ్బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు రైల్వే సీఆర్ఎస్ ట్రాక్ పరిశీలన

- రైల్వే సొరంగమార్గం పూర్తి



కాజీపేట రూరల్: కాజీపేట-హసన్‌పర్తి, హసన్‌పర్తి-వరంగల్ మధ్య నూతనంగా నిర్మించిన మూడవ రైల్వేలైన్, బైపాస్ లైన్, కాజీపేట-హసన్‌పర్తి మధ్య నిర్మించిన రైల్వే సొరంగ మార్గాన్ని గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు దక్షిణ మధ్య రైల్వే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీ చేస్తారని బుధవారం రైల్వే అధికారులు తెలిపారు. సేఫ్టీ కమిషనర్ ట్రాక్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఫిట్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత ట్రయల్ రన్ చేస్తారని ఆ తర్వాత నూతన రైల్వేట్రాక్‌లపై రైళ్లు పరుగులు పెడతాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై ఫిర్యాదు

వరంగల్ క్రైం: మహారాష్ట్ర బుల్‌దాన నియోజవర్గ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సంజయ్ గైక్వాడ్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాలుకను కోసిన వారికి రూ. 11 లక్షల బహుమతి ఇస్తామని ప్రకటన చేసి ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుడా చైర్మెన్ వెంట కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ పిల్ల కార్తీక్, సభ్యులు దుగ్గి అచ్యుత్‌కుమార్, చెడుపాక అరుణ్ తదితరులు ఉన్నారు.



ఆదాయం ఎవరి జేబులోకి?

కాంప్లెక్స్ లీజు ఒప్పంద నిబంధనలు బేఖాతరు

- 'కుడా' నిర్లక్ష్యంతో నష్టపోతున్న క్రీడా సంస్థ
- ఆదాయం వస్తున్నా.. ఏడాదిగా అద్దె చెల్లించని 'కుడా'
- అధికారుల తీరుపై అనుమానాలు

వరంగల్ స్పోర్ట్స్: ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయి. నిబంధనలు నిర్వీర్యమయ్యాయి. ఆదాయం వస్తున్నా.. అద్దె చెల్లించుడు మాత్రం ఆగిపోయింది. పటిష్టంగా రాసుకున్న ఒప్పందాన్ని (ఎంఓయూ) పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులే తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చే వనరుల అంశంలో అధికారుల తీరుపై విమర్శలొస్తున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తున్న 'కుడా' అధికారుల వ్యవహారంతో ఎవరికి మేలు జరుగుతుందో.. ప్రభుత్వ ఖాతాలో జమ కావాల్సిన లక్షల రూపాయల ఆదాయం ఎవరి జేబులోకి వెళ్తుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

2011లో లీజు ఒప్పందం..

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఎదురుగా ఇండోర్ స్టేడియానికి ఆనుకుని ఉన్న జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థకు చెందిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు 'కుడా'తో లీజు ఒప్పందం కుదుర్చుకుంది. 2011లో జరిగిన ఒప్పందం ప్రకారం 'కుడా' తన పూర్తి ఖర్చులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలి. నిర్మాణం పూర్తయ్యాక వచ్చే ఆదాయం క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ), 'కుడా'లకు చెరో సగం వర్తిస్తుంది. ఇలా 20 ఏళ్లు లీజు కొనసాగేలా ఒప్పందం చేసుకున్నారు. ఆదాయ లావాదేవీలు పారదర్శకంగా జరిగేలా ఎంఓయూలో జాయింట్ అకౌంట్ తీయాలని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారు. అద్దె, అడ్వాన్సుల రూపంలో వచ్చే ఆదాయంలో సగం, సగం తీసుకునేలా నిబంధనలున్నాయి. ఆదాయం సమకూర్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 'కుడా' జాయింట్ అకౌంట్ తీయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. వచ్చిన ఆదాయమెంతో స్పష్టంగా తెలియజేయకుండా మొదటి దఫాలో కొంత మొత్తాన్ని డీఎస్ఏ ఖాతాలో జమ చేసింది. ఆతర్వాత గడిచిన 9 నెలలుగా ఒక్క రూపాయి చెల్లించలేదు. లావాదేవీల విషయాన్ని డీఎస్ఏ అధికారులకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిస్తోంది.

అక్రమార్కుల జేబుల్లోకి!

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'కుడా' కాంప్లెక్స్ ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒప్పందం ప్రకారం.. 2013లో పూర్తి కావాల్సిన కాంప్లెక్స్, అనేక అవాంతరాలు, అడ్డంకుల నడుమ రెండు సంవత్సరాల క్రితం పూర్తి చేసుకుంది. గడిచిన రెండేళ్లుగా అద్దెలు, షటర్ అడ్వాన్సుల రూపంలో లక్షలను గడిస్తోంది.

9 నెలలుగా జాప్యం..

ఒప్పందం ప్రకారం.. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు చెల్లించాల్సిన 50 శాతం అద్దెను డిసెంబర్ 16, 2022 నుంచి డిసెంబర్ 12, 2023 వరకు రూ. 53,16,012 లక్షలను 'కుడా' చెల్లించింది. మళ్లీ 9 నెలలుగా చెల్లించకుండా కాలం వెళ్లదీస్తోంది. లీజు అగ్రిమెంట్ ప్రకారం అద్దె చెల్లించకపోవడంపై 'కుడా' అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ జోక్యం చేసుకుని విచారిస్తే అసలు నిజాలు బయటపడతాయని పలువురు క్రీడాభిమానులు చెబుతున్నారు.

ఎంఓయూ ప్రకారం చెల్లించాలి..



షాపింగ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే ఆదాయం, లావాదేవీలకు సంబంధించి కుదుర్చుకున్న ఎంఓయూ ప్రకారం చెల్లించాలి. తద్వారా వచ్చే ఆదాయంతో డీఎస్ఏకు నిధుల కొరత బాధ తీరుతుంది. నిధులు సకాలంలో అందిస్తే క్రీడాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టొచ్చు. పెండింగ్‌లో ఉన్న నిధులు అందేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

- గుగులోత్ అశోక్ కుమార్, డీవైఎస్ఓ, హనుమకొండ

'కుడా' చైర్మన్, కలెక్టర్‌ను అడగండి

'కుడా' కాంప్లెక్స్ విషయంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థతో చేసుకున్న ఒప్పందం, లావాదేవీల అంశం నా పరిధిలో లేదు. ఈ విషయంలో ఎలాంటి సమాచారం కావాలన్నా 'కుడా' చైర్మన్ లేదా 'కుడా' వీసీ కలెక్టర్‌ను అడగండి.

- అజిత్‌రెడ్డి, 'కుడా' పీఓ

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నాలాలు, చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలతో పాటు కార్పొరేషన్ పరిధిలో ఉన్న పార్కుల సమాచారం ప్రభుత్వ ఆస్తుల సంబంధిత సమాచారం కలిగి ఉండాలన్నారు. నగర వ్యాప్తంగా 66 డివిజన్లలో ఉన్న పక్కా గృహాలు, బీపీఎల్ గృహాలకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించి సమగ్ర వివరాలతో నమోదు చేసి నివేదిక అందజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి సంబంధిత అంశాలను ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రీవెన్స్ సెల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఫిర్యాదులు అధిక మొత్తంలో వస్తున్నాయని ఆ సమస్యలు పునరావృతమవకుండా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఏసీపీ రవీందర్ రాడికర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ఖాద్, టీపీఎస్‌లు అనిల్, రజిత, రోజారెడ్డి, శ్రీకాంత్, టీపీబీఓలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

వరంగల్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. నగర పరిధి వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తయిన నేపథ్యంలో.. బిల్లుల చెల్లింపుల కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యతా ప్రమాణాల్ని పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఎంజీఎం ఆస్పత్రి హెచ్‌ఓడీలతో సమీక్ష

వరంగల్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళితో కలిసి ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత విభాగాల హెచ్‌ఓడీలతో కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంజీఎం ఆస్పత్రికి ప్రతిరోజు సుమారు 2 వేల మంది ఔట్‌పేషెంట్లు వస్తున్న దృష్ట్యా ఓపీ యూనిట్‌ను వయోవృద్ధుల వార్డుకు మార్చాలని, వయోవృద్ధుల వార్డును కాకతీయ మెడికల్ కళాశాలలోని పీఎంఎస్ఎస్‌వైకు మార్చుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతమున్న ఓపీ వార్డును నవీకరించి రోగులు, అటెండెంట్స్‌ల విశ్రాంతి కోసం ఏర్పాటు చేయాలన్నారు. రోగుల సౌకర్యార్థం ఓపీ కౌంటర్ల సంఖ్య పెంచాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంఓలు శ్రీనివాస్, మురళి, శేషు, రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, పాథాలజీ, రేడియో థెరపీ, పిడియాట్రిక్స్ తదితర విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలి

వరంగల్: గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ డీపీఓ, జెడ్పీ సీఈఓ రాంరెడ్డితో కలసి గ్రామపంచాయతీల ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా రూపకల్పనపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాలల్లో ఉన్న 325 గ్రామ పంచాయతీల పరిధిలో 2,828 వార్డులున్నట్లు తెలిపారు.

క్రైం ఏసీపీగా భోజరాజు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీగా ఎం.భోజరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం క్రైం ఏసీపీగా పనిచేస్తున్న భోజరాజును ఇక్కడికి బదిలీ చేసింది. 1995 బ్యాచ్‌కు చెందిన భోజరాజు గతంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను అధికారులు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బాధితులపైనే కేసులా?

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

హన్మకొండ: నిమజ్జన శోభాయాత్ర దాడిలో గాయపడిన వారిపైనే పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం ఆశ్చర్యకరంగా ఉందని.. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16న శాయంపేట మండలం ప్రగతి సింగారంలో గణేశుడి నిమజ్జనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చారని తెలిపారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తాము బాధితులమని, తమపై ఎందుకు కేసు పెడతారని ప్రశ్నిస్తే రౌడీషీట్ తెరుస్తామని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్ కమిషనర్, రాష్ట్ర డీజీపీ ఉన్నత స్థాయి అధికారితో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణ చర్యలు చేపట్టాలి

- వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ

వరంగల్: జిల్లాలో డెంగీ వ్యాధి నియంత్రణ చర్యలను చేపట్టాలని వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. గ్రేటర్ వరంగల్ 12, 15వ డివిజన్లలోని డాక్టర్స్‌కాలనీ, టెలిఫోన్ కాలనీ, కీర్తినగర్, స్నేహనగర్ కాలనీల్లో నమోదైన డెంగీ కేసుల ప్రాంతాలను సందర్శించారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో కలిసి దోమల నివారణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యసిబ్బంది విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రేటర్ బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు సదానందం తదితరులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ పనైపోయింది..



హనుమకొండలోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, తదితరులు

- అందుకే గాంధీ కుటుంబంపై అక్కసు
- రాహుల్‌గాంధీ అంటే ఆషామాషీ వ్యక్తి కాదు
- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్
- ఇందిరాగాంధీ కాలిగోటికి కూడా సరిపోరు : మంత్రి పొన్నం ప్రభాకర్
- రాహుల్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలపై నిరసన ధర్నా

హన్మకొండ చౌరస్తా: 'జమ్మూకశ్మీర్‌లో బీజేపీ తుడిచిపెట్టుకుపోనుంది. మహారాష్ట్రలో కాలం చెల్లింది. హరియాణాలో కాంగ్రెస్ రాబోతుంది. మొత్తంగా భారత్‌లో బీజేపీ పనైపోయింది' అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం హనుమకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్‌కుమార్‌గౌడ్ ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆషామాషీ వ్యక్తి కాదన్నారు. భారత్ జోడో యాత్రలో ఆయనకు వచ్చిన జనాదరణతో భవిష్యత్ ప్రధానిగా తేలిపోయిందన్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎదుర్కోలేక గాంధీ కుటుంబంపై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నలుగురు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులకు ఏమాత్రం బుద్ధి ఉన్నా గాంధీ కుటుంబ చరిత్ర తెలుసుకోవాలన్నారు. బ్యాంకుల జాతీయకరణ, గరీబ్ హఠావో వంటి అనేక సంక్షేమ ఫలాలను అందించడమే కాకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. వారి కుటుంబం కాలి గోటికి సరిపోని వ్యక్తులు ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. కులగణనపై రాహుల్‌గాంధీకి స్పష్టత ఉందని, 420 సీట్లు గెలుస్తామన్న బీజేపీకి నమ్మకం సన్నగిల్లిందన్నారు. ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్‌లో టెర్రరిస్టుల మాదిరిగా మాట్లాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్, టీపీసీసీ నాయకులు దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, జీవీఎస్ శ్రీనివాసచారి, కూచన రవళి, బంక సరళ, నాయిని లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, అంకూస్, మోజెస్ ఆనంద్, బుచ్చిరెడ్డి, సాంబయ్య, మండల సమ్మయ్య, పింగిళి వెంకట్‌రెడ్డి, కొలుగూరి రాజు, అశోక్‌రెడ్డి, నిమ్మాని శేఖర్‌రావు, కట్కూరి దేవేందర్ రెడ్డి, కర్ర హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు.

భద్రకాళి అమ్మవారికి పూజలు



వరంగల్ భద్రకాళి ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయాన్ని బుధవారం టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ సందర్శించారు. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు ఉన్నారు. వారికి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషు భారతి, దేవాలయ అర్చకులు భద్రకాళి శేషు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరులను, వల్లభగణపతిని దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ స్నపనమండపంలో అర్చకులు వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

నేటినుంచి ప్రత్యేక వైద్యశిబిరాలు

- డీఎంహెచ్ఓ లలితాదేవి

ఎంజీఎం: సీజనల్ వ్యాధుల నియంత్రణకు నేటి (గురువారం) నుంచి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధి గ్రామాలు, కాలనీల్లో వారంలో నాలుగు రోజులు (సోమ, మంగళ, గురు, శుక్రవారం) ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ కె.లలితాదేవి తెలిపారు. ఈక్యాంపులకు సంబంధించిన షెడ్యూల్‌ను వైద్యాధికారులకు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాల్లో పరీక్షల నిర్వహణ, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

జిల్లాలోని దామెర, సిద్ధాపూర్, హసన్‌పర్తి పీహెచ్‌సీలను డీఎంహెచ్ఓ లలితాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందుల లభ్యత, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న జ్వర సర్వే, నమోదవుతున్న జ్వరాల సంఖ్యను పరిశీలించారు.



పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ లలితాదేవి

క్లుప్తంగా

శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిధిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలోని ఎకనామిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి మంగళవారం రాత్రి షోకాజ్‌నోటీస్ జారీచేశారు. ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలోని తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. సదాశివ్ తనను యూనివర్సిటీలోని తెలుగు విభాగానికి బదిలీచేయాలని శ్రీధర్‌కుమార్‌తో కలిసి వచ్చి బెదిరిస్తూ, అమర్యాదగా మాట్లాడారని ఆరోపిస్తూ ఈనెల 16న తెలుగు విభాగం అధిపతి ఏటూరిజ్యోతి ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం విధితమే. సీరియస్‌గా పరిగణించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. సదాశివ్‌కు, శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు వేర్వేరుగా షోకాజ్‌నోటీస్‌లు జారీచేశారు. కాంట్రాక్టు సర్వీస్ కోసం ఒప్పందం, ప్రవర్తనానియమావళి నిబంధనలు ఉల్లఘించారని, మీపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో ఇద్దరూ వివరణ ఇవ్వాలని షోకాజ్‌నోటీస్‌లో పేర్కొన్నారు.

వన్యప్రాణులను వేటాడి చంపిన ముగ్గురిపై కేసు


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న అధికారులు

వెంకటాపురం(ఎం): విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను (అడవి పందులు) వేటాడుతున్న ముగ్గురిపై వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ములుగు ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ తెలిపారు. మండలంలోని చెంచుకాలనీ శివారులో కొంతమంది అడవి పందులను వేటాడి చంపి కాల్చుతున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. చెంచుకాలనీకి చెందిన ఇండ్ల రవి, ఇండ్ల సారయ్య, ఆవుల వాసు.. సమీప అటవీప్రాంతంలో విద్యుత్ తీగలతో ఏర్పాటు చేసిన ఉచ్చుల్లో పడి బుధవారం తెల్లవారుజామున నాలుగు అడవి పందులు మృత్యువాత పడ్డాయి. ఆ పందులను చెంచుకాలనీ సమీపంలో కాల్చుతుండగా దాడి చేసి పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి బైండింగ్ వైర్, ఉచ్చులు, కత్తులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దాడుల్లో డిప్యూటీ రేంజర్ మధుబాబు, ఎఫ్‌బీఓలు పులేందర్, కిషన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

సేవ.. మరింత చేరువ

19 ఫీచర్లతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్

- కొత్త కనెక్షన్ తీసుకోవడంతోపాటు సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు
- సెల్ఫ్ రీడింగ్‌తో పాటు బిల్లుల చెల్లింపు కూడా..
- మెరుగైన సేవలే లక్ష్యంగా ముందుకు..

హన్మకొండ: ఇక నుంచి విద్యుత్ సేవలు, సమస్యలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు అవసరమైన సేవలు సులువుగా పొందేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా వినియోగదారుల ముంగిటే సేవలు అందించేందుకు రూపొందించిన మొబైల్ యాప్‌ను మరింత ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు నూతన విద్యుత్ సర్వీస్ పొందాలంటే మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మొబైల్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. వినియోగదారుల సేవలకు సంబంధించిన 19 ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించింది. దీంతో వినియోగదారులకు సేవలు మరింత చేరువయ్యాయి. మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందొచ్చు. యాప్‌ను ఓపెన్ చేయగానే 19 ఫీచర్స్ కనిపిస్తాయి. అవసమైన ఫీచర్‌పై నొక్కి సేవ పొందొచ్చు.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ : ఎక్కడైనా ఎలాంటి ఘటనా జరిగిన ఇందులో జీపీఎస్ లొకేషన్ ద్వారా వినియోగదారుడి మొబైల్ ఫోన్‌లోని కెమెరా నుంచి ఆ ఘటనను ఫోటో తీసి పంపొచ్చు. తద్వారా ఈ రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. వెంటనే ఆ అధికారి స్పందించి సమస్యను పరిష్కారిస్తారు.

కన్జ్యూమర్ గ్రీవెన్సెస్: ఈ ఫీచర్‌లో మూడు రకాల సేవలుంటాయి. వినియోగదారుడు తమ సమస్యలను నేరుగా ఇందులో పొందుపరచొచ్చు. వారి మీటర్ నంబర్, సమస్య తాలూకు వివరాలు ఇందులో నమోదు చేస్తే ఆ సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతి అంశం పై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఈ ఫీచర్‌లో ఉంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ మీటర్ రీడింగ్‌ను తీసుకునే సౌలభ్యం ఉంది. ప్రతి నెల వినియోగదారులు తమ మీటర్ రీడింగ్ చేసుకుని కచ్చితమైన బిల్లింగ్ పొందొచ్చు.

పే బిల్స్: ఈ ఫీచర్ ద్వారా నెల వారి విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకుని చెల్లించే అవకాశముంది. ఇది చాలా సులభం. సౌకర్యవంతం. వ్యయప్రయసలు ఉండవు. కేవలం రెండు నిమిషాల్లో చెల్లించొచ్చు.

వినియోగదారుడి అరచేతి (ఫోన్)లో విద్యుత్ సమాచారం



టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్



వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు:
వినియోగదారుల పరిధిలోని అధికారులకు సంబంధించిన వివరాలు ఈ ఫీచర్‌లో ఉంటాయి. తమ సందేహాలను సంబంధిత అధికారికి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

లింక్ ఆధార్– మొబైల్ నంబర్:
వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్ చేసుకోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు అందుతుంది. తద్వారా వెంటనే యాప్ ద్వారా బిల్లులు చెల్లించొచ్చు.

కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి:
కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో పొందుపరిచారు. విద్యుత్ కనెక్షన్ కోసం సమర్పించాల్సిన పత్రాల వివరాలు, సెక్యూరిటీ డిపాజిట్ వంటి వివరాలు ఇందులో కనిపిస్తాయి.

కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కటి డిజిటలైజేషన్‌గా మారుతోంది. ఈ చెల్లింపు శ్రేయస్కరం.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతి నెల వచ్చే బిల్లు పోల్చుకోవడం ద్వారా విద్యుత్‌ను పొదుపుగా వాడుకునే అవకాశముంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల సమాచారాన్ని ఈ ఫీచర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏ నెలలో ఎంత మొత్తం చెల్లించామనే వివరాలు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి.

డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్: వినియోగదారుల నెల వారి విద్యుత్ వినియోగం, మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే బిల్లుకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుస్తుంది.

పేరు, లోడ్ మార్పు గురించి: విద్యుత్ మీటర్ పేరు మార్పు ఎలా చేసుకోవాలి.. ఏ పత్రాలు సమర్పించాలి వంటి వివరాలు ఈ ఫీచర్‌లో ఉంటాయి. ఆ వివరాల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పవర్ కంజంప్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో పొందుపరిచారు. గృహ వినియోగదారులు, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర విద్యుత్ సర్వీస్‌లు చార్జీల వివరాలు పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్ టిప్స్: ఇందులో విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు ఉన్నాయి. విద్యుత్‌ను ఎలా పొదుపుగా వాడుకోవచ్చో తెలుసుకునే సౌకర్యం ఉంది.

సేఫ్టీ టిప్స్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకునే జాగ్రత్తలు ఇందులో వివరించారు. వినియోగదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఇక్కడ వారి అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా సేవల్లో మార్పు తీసుకురావడానికి దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వినియోగదారుడి సర్వీస్ వివరాలు, ఇతర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: వినియోగదారుల బిల్లు సమాచారం ఈ ఫీచర్‌లో ఉంటుంది. ఇందులో వినియోగదారుల సర్వీస్ నంబర్‌ను నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు పొందుపరిచారు. వినియోగదారులు తమకు ఏదైనా అవసరం వస్తే ఫోన్ నంబర్ తెలుసుకోడానికి ఈ యాప్‌లో పొందుపరిచారు. ఈ టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవచ్చు.

పిల్లర్లే మిగిలాయి..


బాల్నిధర్మారం ఆకేరు వాగులో మిగిలిన బ్రిడ్జి పిల్లర్లు

- ఆకేరు వాగు ఉధృతికి పోయిన బ్రిడ్జి
- మహబూబాబాద్-ఖమ్మం జిల్లాల సరిహద్దు గ్రామాలకు రాకపోకలు బంద్


వరదకు కొట్టుకుపోయి కొద్ది దూరంలో పడి ఉన్న బ్రిడ్జి

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన అతిభారీ వర్షాలకు వచ్చిన వరద నీరు ఉధృతికి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్నిధర్మారం శివారు ఆకేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి పోయింది. సుమారు 100 మీటర్ల దూరానికి బ్రిడ్జి పోయింది. కేవలం పిల్లర్లు మాత్రమే మిగిలాయి. మహబూబాబాద్- ఖమ్మం జిల్లాల సరిహద్దులోని ఆకేరు వాగుపై 2018లో రూ.16 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మించారు. దీంతో రెండు జిల్లాల సరిహద్దులోని గ్రామాలకు రాకపోకలు సురక్షితంగా జరిగాయి. ఈ క్రమంలో కేవలం ఆరు సంవత్సరాలకే బ్రిడ్జి పోవడంతో రెండు జిల్లాల మధ్య వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి. తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే బ్రిడ్జి వరద ఉధృతికి పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జిని పునరుద్ధరించి రాకపోకలు కల్పించాలని ఆయా జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిమజ్జన వాహనాన్ని ఢీకొన్న అంబులెన్స్

- పైలెట్‌ను చితకబాదిన యువకులు
- మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


బట్టల బజార్ ఫ్లైఓవర్‌పై వాహనాన్ని ఢీకొనడంతో 108 వాహనంపై పడిన వినాయక విగ్రహం

ఖిలా వరంగల్: వరంగల్ బట్టల బజార్ ఫ్లైఓవర్‌పై వినాయక నిమజ్జనానికి వెళ్తున్న వాహనాన్ని రోగిని ఎంజీఎం తీసుకెళ్తున్న అంబులెన్స్ ఢీకొంది. ఈ ఘటనలో వినాయక విగ్రహం 108 వాహనంపై పడింది. దీంతో పెరకవాడకు చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు 108 పైలెట్ (డ్రైవర్)ను తాళ్లతో కట్టేసి చితకబాదారు. బాధితుడి కథనం ప్రకారం.. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గడ్డం కుమారస్వామి 108 వాహన పైలెట్ (డ్రైవర్)గా పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన ఓ రోగిని 108లో బుధవారం తెల్లవారుజామున ఎంజీఎం తరలిస్తుండగా.. వరంగల్ బట్టలబజార్ ఫ్లైఓవర్‌పై వినాయ విగ్రహాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక యువకులు.. కుమారస్వామిని తాళ్లతో కట్టేసి చితకబాదారు. ఈదాడిలో కుమారస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. సుమారు 4గంటల సమయంలో 108 వాహన మెడికల్ టెక్నీషన్స్ మరో వాహనాన్ని తెప్పించి పేషెంట్‌తోపాటు పైలెట్ కుమారస్వామిని ఎంజీఎం తరలించారు. కుమారస్వామి ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. కుమారస్వామి ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

పీహెచ్‌డీ సీటు ఇవ్వాలని అభ్యర్థి వేధించారు

- కేయూ ఫార్మసీ కళాశాల డీన్ సమ్మయ్య ఆరోపణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పీహెచ్‌డీ సీటు ఇవ్వాలని మనోహర్ అనే అభ్యర్థి తనను వేధింపులకు గురిచేశారని ఆ కళాశాల డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆరోపించారు. ఈ ఘటనపై ఇటీవల ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా మంగళవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీన్ సమ్మయ్య కథనం ప్రకారం.. ఈనెల 12వ తేదీన మనోహర్‌తోపాటు అతడి స్నేహితులు ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చారు. మనోహర్‌కు పీహెచ్‌డీ సీటు కేటాయించాల్సిందేనని, లేనిపక్షంలో చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారు. ఫార్మసీ కళాశాలలో పీహెచ్‌డీ రెండోకేటగిరీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే మెరిట్‌కమ్ రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేశారు. మొదటి, రెండో కేటగిరీ కలిపి 41 మంది అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. మెరిట్‌కమ్ రిజర్వేషన్ ప్రకారం మనోహర్‌కు సీటు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. అయినా ఇదేమి పట్టించుకోకుండా పీహెచ్‌డీ సీటు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంతేగాకుండా ముందు ఎంపికైన అభ్యర్థి స్థానంలో తనకు సీటు ఇవ్వాలని మనోహర్ కొద్దిరోజులుగా సమ్మయ్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో చంపేస్తానని బెదిరించడంతోపాటు దౌర్జన్యం చేయబోయారు. దీంతో సమమ్మ అనారోగ్యానికి గురికావడంతో వైద్య చికిత్సలు చేయించుకున్నాడు. ఈ రిపోర్టులను ఇన్‌చార్జి వీసీకి వాట్సాప్ ద్వారా రిజిస్ట్రార్‌కు, పోలీసుస్టేషన్‌లో నేరుగా ఫిర్యాదుతోపాటు జతచేశానని సమ్మయ్య బుధవారం వెల్లడించారు. ఇదిలా ఉండగా ఓ కానిస్టేబుల్ ఫార్మసీ కళాశాలకు వచ్చి సమ్మయ్య ఫిర్యాదుపై విచారణ చేశారని సమాచారం.

పత్తిలో తెగుళ్లను నివారించాలి : డీఏఓ


పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ కె.అనురాధ

ఖిలా వరంగల్: పత్తి పంటలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ రైతులకు సూచించారు. ఈమేరకు బుధవారం వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లోని పలు గ్రామాల్లో జాలువారిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ పత్తిలో వేరుకుళ్లు తెగులు నివారణకు 19.19.19 మ్యాక్రోన్యూట్రిషన్ లేదా 3.0.45 5 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగు నివారణకు 60 మిల్లీలీటర్ల ఉలాల 20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అంతేకాకుండా వివిధ సర్వే నంబర్లలో రైతులు సాగు చేసిన పంట వివరాలతో పోల్చి క్రాప్‌బుకింగ్ యాప్ ద్వారా పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.వంశీ కృష్ణ, ఖిలావరంగల్ ఏఈఓ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపొచ్చు

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ప్రచురించిన ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అభ్యంతరాలుంటే తెలియజేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలుంటాయని పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే తెలిపి తుది ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్లున్నాయని, వీటిలో మొత్తం 210 జీపీలుండగా.. 1,986 వార్డులున్నాయన్నారు. జిల్లాలోని జీపీల వారీగా మొత్తం 3,65,828 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఈనెల 28న తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. సమావేశంలో డీఎల్పీఓ గంగా భవాని, షర్ఫుద్దీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్యాంసుందర్, నిశాంత్, రజనీకాంత్, ఎండీ నేహాల్, ప్రవీణ్‌కుమార్, మణి, లక్ష్మణ్, రవి, సయ్యద్ ఫైజుల్లా, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్రెడిబులిటీ లేని పార్టీ

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన గంటా రవి తదితరులు

రామన్నపేట : కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఏనాడో క్రెడిబులిటీ కోల్పోయిందని, అటు ఢిల్లీలో.. ఇటు గల్లీలో అధ్వానంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. పదేళ్లపాటు దాడులకు పాల్పడిన బీఆర్‌ఎస్‌ను సామాజిక బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్ నగరంలోని మట్టివాడలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సిక్కులకు భద్రత లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతదేశంలో కాకుండా అమెరికాలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సిక్కుల ఊచకోత జరిగిందని, కాంగ్రెస్ మంత్రిగా పనిచేసిన వ్యక్తే రాహుల్‌గాంధీ గురించి వ్యాఖ్యానించారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ఎవరూ నమ్మడం లేదని, తన మాటల మీద రేవంతర్‌రెడ్డికే నమ్మకం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లో కారు గుర్తుతో గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా అఫిడవిట్ సమర్పించారని గుర్తు చేశారు. అరికెపూడి గాంధీని కాంగ్రెస్ పార్టీలోకి వలస వచ్చిన 9వ ఎమ్మెల్యేగా ఆహ్వానించిన సీఎం.. హైదరాబాద్‌లో జరిగిన ఘర్షణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా అభివర్ణించడం వారి వ్యవహారశైలికి అద్దం పడుతుందన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి ఘటనలో కేటీఆర్ (ట్విట్టర్ టిల్లుగా పోలుస్తూ) స్పందించిన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. వరంగల్ జిల్లాలో పాదయాత్ర చేసిన బీజేపీ అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై జరిగిన దాడి గుర్తు లేదా ట్విట్టర్ టిల్లు అంటూ ఎద్దేవా చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్థలం కేటాయిస్తే బీజేపీ ఎంపీగా ఆరు నెలల వ్యవధిలోనే ఎయిర్‌పోర్టును తీసుకువస్తానని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, శ్రీనివాస్, వెంకట్, శ్యామ్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ రఘునందన్‌రావు...

హన్మకొండ కల్చరల్: ఉదయం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

‘వందేభారత్’ పరుగులు..

- నేటి నుంచి కాజీపేట జంక్షన్ మీదుగా రాకపోకలు మరూ..
- వివరాలు వెల్లడించిన రైల్వే అధికారులు


వందేభారత్ ఎక్స్‌ప్రెస్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా గురువారం నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం రాత్రి తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్రలో సికింద్రాబాద్, కాజీపేట, చంద్రాపూర్, నాగ్‌పూర్ ప్రధాన నగరాలను కలుపుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. 585 కి.మీ. దూరంతో 7.20 గంటల ప్రయాణంతో ఈ రైలు 20 కోచ్‌లు కలిగి ఉంటుంది.

చార్జీలు

సికింద్రాబాద్-కాజీపేట టికెట్ ధర చైర్‌కార్-రూ.710, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1195, కాజీపేట-రామగుండం చైర్‌కార్ రూ.650, ఎగ్జిక్యూటివ్ చైర్ 1070, కాజీపేట-బల్హార్షా చైర్‌కార్ రూ.950, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1655, కాజీపేట-చంద్రాపూర్ చైర్‌కార్ రూ.975, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1705, కాజీపేట-నాగ్‌పూర్ చైర్‌కార్ రూ.1280, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.2325.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వివరాలు

నాగ్‌పూర్-సికింద్రాబాద్ (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం తప్ప అన్ని రోజుల్లో ప్రయాణిస్తుంది.

స్టేషన్	సమయం
నాగ్‌పూర్	ఉదయం 5.00 గంటలు
సేవాగ్రామ్	5.43 గంటలు
చంద్రాపూర్	7.03 గంటలు
బల్హార్షా	7.20 గంటలు
రామగుండం	9.08 గంటలు
కాజీపేట జంక్షన్	10.04 గంటలు
సికింద్రాబాద్ జంక్షన్	మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది.

సికింద్రాబాద్-నాగ్‌పూర్ (20102) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం తప్ప అన్ని రోజుల్లో ప్రయాణిస్తుంది.

స్టేషన్	సమయం
సికింద్రాబాద్	మధ్యాహ్నం 1.00 గంటలు
కాజీపేట జంక్షన్	2.28 గంటలు
రామగుండం	3.23 గంటలు
బల్హార్షా	సాయంత్రం 5. 25 గంటలు
చంద్రాపూర్	05.33 గంటలు
సేవాగ్రామ్	రాత్రి 07.03 గంటలు
నాగ్‌పూర్	08.20 గంటలకు చేరుతుంది.

విష జ్వరంతో మహిళ మృతి


రమ (ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని గుంటూరుపల్లికి చెందిన బండి రమ(43) విషజ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రమ 5 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం మంగళవారం హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉండగా, గతేడాది వడదెబ్బతో భర్త మృతి చెందాడు. ఈ విషయమై వెంకటాపురం వైద్యాధికారి శ్రీకాంత్‌ను ‘సాక్షి’ సంప్రదించగా రమ కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిందన్నారు. విషజ్వరంతో కాదని వివరణ ఇచ్చారు.

విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన

- వార్డెన్‌కు దేహశుద్ధి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన వార్డెన్‌కు దేహశుద్ధి చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాదెరుక్మారెడ్డి మెమోరియల్ హై స్కూల్‌లో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఆ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో విద్యార్థిని ఇంటికి వెళ్లి వార్డెన్ అబ్రహం మొబైల్ ఫోన్‌కు హాయ్ అని మెసేజ్ చేసింది. దీంతో ఇద్దరు ఫోన్‌లో చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థినికి వార్డెన్ ఐ లవ్ యూ అని మెసేజ్ చేశాడు. విద్యార్థిని ఈ విషయం తన తండ్రికి చెప్పడంతో బుధవారం పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. స్కూల్ ఆవరణలోనే వార్డెన్ కనిపించడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు దేహశుద్ధి చేశారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు.